సాక్షి గుంటూరు

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



పిడుగురాళ్లలో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అంబటి, అనిల్, ఎమ్మెల్యేలు, రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తదితరులు





బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద బస్సు యాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం. ఇన్‌సెట్‌లో ఫ్యాన్ గుర్తును చూపుతున్న వైఎస్ జగన్

పల్నాట జైత్రయాత్ర

జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాటి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండుటెండను లెక్క చేయకుండా అభిమాన నేత చూసేందుకు రోడ్లపైకి వచ్చారు. గంటల తరబడి నిరీక్షించారు. జననేతపై పూల వర్షం కురిపించి అభిమానం చాటుకున్నారు. మనవడిని చూసి అవ్వలు తాతలు..అన్నను చూసి చెల్లెమ్మలు మురిసిపోయారు. తమ నేతను చూసి, అయ్యా నువ్వే మళ్లీ సీఎం కావాలయ్యా అంటూ దీవెనలు అందించారు. కొందరు మహిళలు బస్సు ముందు గుమ్మడికాయతో దిష్టి తీశారు. దారి పొడవునా యువకులు పెద్ద జెండాలు పట్టుకుని జై జగన్ అంటూ మోటారు బైకులపై ముందుండి నడిపించారు. పెత్తందారులపై పోరుకు సిద్ధమా అన్న జగన్ మాటలకు మేమంతా సిద్ధం అంటూ లక్షలాది మంది గొంతు కలిపారు. బుధవారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి బయలుదేరి బస్సు యాత్ర పిడుగురాళ్ల వరకు అక్కడ నుంచి ధూళిపాళ్ల వరకు దిగ్విజయంగా కొనసాగింది.

- పిడుగురాళ్లలో సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ
- భారీగా తరలివచ్చిన జనసందోహం
- మండుటెండను లెక్క చేయని ప్రజలు
- ముఖ్యమంత్రి ప్రసంగానికి విశేష స్పందన
- గంటావారిపాలెం నుంచి మొదలైన యాత్ర
- యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- బస్సుయాత్రలో అన్ని వర్గాల ప్రజలతో మమేకం





అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, బస్సుపై అనిల్‌కుమార్ యాదవ్, అంబటి



మామను చూడు... చిన్నారిని పైకెత్తుకున్న ఓ తండ్రి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తన సెల్‌ఫోన్‌తో ఫోటో తీస్తున్న చిన్నారి

జిల్లాలో అభ్యర్థులు





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసరావుపేట పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులను సభకు పరిచయం చేశారు. పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, సత్తెనపల్లి, మాచర్ల, నరసరావుపేట, గురజాల, వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థులు అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, కావటి శివనాగమనోహర్ నాయుడు

సాక్షి,నరసరావుపేట: నిప్పులు చెరుగుతున్న సూర్యుడిని లెక్కచేయకుండా తమ గుండెల్లో కొలువైన అభిమాన నేతను చూసేందుకు పల్నాడు ప్రజలు పోటెత్తారు. వీరి అభిమానం ముందు భానుడి ప్రతాపం చిన్నబోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా బుధవారం పిడుగురాళ్లలో నిర్వహించిన బహిరంగసభకు పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరయ్యారు. తమ అభిమాన నేతను చూడగానే వారిలో అభిమానం ఉప్పొంగింది. జననేత నోటి నుంచి వచ్చిన ప్రతిమాటకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ర్యాంప్‌పై సీఎం నడుస్తున్న సమయంలో అభిమానుల ఆనందం అంతాఇంత కాదు. పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేసి వారిని ఆశీర్వదించమని, గెలిపించమని పల్నాడు ప్రజలను కోరారు.

పార్టీలో చేరికలు

మేమంతా సిద్ధం బస్సు యాత్ర 12వ రోజుకు చేరింది. రాత్రి బస కేంద్రం గంటావారిపాలెం నుంచి బుధవారం ఉదయం 10.15గంటలకు యాత్ర మొదలైంది. అంతకుముందు వైఎస్సార్ సీపీలోకి మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌రెడ్డి, పాముల రాజేశ్వరిదేవి, జనసేన పార్టీ విజయవాడ వెస్ట్ ఇన్‌చార్జిగా పనిచేసిన పోతిన మహేష్‌లను సీఎం వైఎస్ జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు వచ్చిన ముఖ్యనేతలను పార్టీలోకి చేర్చుకున్నారు. బస కేంద్రం ఎదుట వేచి ఉన్న పలువురితో మాట్లాడి వారి సమస్యలకు పరిష్కారం చూపారు. అక్కడి వేచి ఉన్న వందలాది మంది అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. కామేపల్లి మీదుగా సంతమాగులూరు అడ్డరోడ్డు వద్దకు యాత్ర చేరుకుంది. అక్కడ అప్పటికే వేచి ఉన్న వేలాది మందిని బస్సు టాప్‌పైకి ఎక్కి అభివాదం చేశాడు. చెప్పులు తెగి కాళ్లు కాలిపోతున్నా పరుగులు పెడుతున్న వెంకాయమ్మను ఆత్మీయంగా పలకరించారు. ఆ తర్వాత వెంకాయమ్మ సంబరపడిపోయింది.



నిలువెత్తు అభిమానం.. వైఎస్ జగన్‌కు గజమాలతో స్వాగతం

గుమ్మడికాయలతో దిష్టి తీసి...

బస్సుయాత్ర రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు చేరుకోగానే నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గ నేతలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. మేమంతా సిద్ధం పేరుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఇది చూసి ప్రతిపక్షాలకు కుళ్లుతో దిష్టి తగిలి ఉంటుందని, తమనేతకు అంతా మంచే జరగాలన్న ఉద్దేశంతో రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు అక్కచెల్లెమ్మలు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. తరువాత భారీ గజమాలతో జననేతకు స్వాగతం పలికారు. మళ్లీ మీ ప్రభుత్వమే రావాలంటూ నినాదాలు చేశారు. యాదవ సామాజికవర్గానికి చెందిన రమేష్ బహుకరించిన గొర్రె పిల్లలను ఎత్తుకొని, గొంగలి వేసుకొని వైఎస్ జగన్ మురిసిపోయారు. తరువాత సుబ్బయ్యపాలెం శివారులో తన కోసం వేచి ఉన్న మిర్చి కోత కూలీలతో మాట కలిపారు.

పింఛన్‌దారుల సంఘీభావం

బస్సు యాత్ర రొంపిచర్ల నుంచి సంతగుడిపాడుకి చేరుకుంది. అక్కడ తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాటామంతీ కలిపారు. ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రశ్నించగా, ఏ వివక్ష లేకుండా మీ పాలనలో హాయిగా బతుకుతున్నామని మహిళలు జగనన్నకు సమాధానమిచ్చారు. అక్కడి నుంచి మర్రిచెట్టుపాలెంకు యాత్ర చేరుకోగానే వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు వైఎస్ జగన్‌ను కలిసి యాత్రకు సంఘీభావం తెలిపారు. మీ పాలనలో నెల నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే రూ.3 వేల నగదు అందజేస్తున్నారని తెలిపారు. అక్కడి నుంచి నకరికల్లు అడ్డరోడ్డు, చల్లగుండ్ల మీదుగా నకరికల్లుకు చేరుకుంది. యాత్రకు అడుగడుగునా అపూర్వ స్పందన వస్తుండటంతో అనుకున్న షెడ్యూల్ కన్నా సుమారు మూడు గంటలు ఆలస్యం అయినా ప్రతి పల్లె వద్ద మహిళలు, వృద్ధులు ఎండను లెక్కచేయకుండా వేచి ఉన్న దృశ్యాలు కనిపించాయి. యాత్ర శ్రీరాంపురం తండా, త్రిపురాపురం, శ్రీనివాసనగర్, పెద నెమలిపురిల మీదుగా మధ్యాహ్నం భోజన విరామం కోసం దేవరంపాడు వద్ద ఏర్పాటుచేసిన బస వద్దకు సాయంత్రం 4.20గంటలకు చేరుకున్నారు. కొంత విరామం తరువాత సీఎం వైఎస్ జగన్ పిడుగురాళ్ల చేరుకున్నారు.

మా వెంట అభిమానించే జనం ఉన్నారు

పిడుగురాళ్ల రూరల్/పిడుగురాళ్ల టౌన్: టీడీపీ నాయకులు మా దగ్గర డబ్బు ఉంది.. మీ దగ్గర ఏముందని అంటున్నారు..నేను చెబుతున్నా..మమ్మల్ని ఆదరించే కార్యకర్తలు, అభిమానించే జనం ఉన్నారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్లలో బుధవారం జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. గురజాల నియోజకవర్గంలో రూ.1964 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.

ధూళిపాళ్ల వద్ద రాత్రి బస..

మేమంతా సిద్ధం బహిరంగ సభ అనంతరం సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర ప్రారంభించి కొండమోడు జంక్షన్, కోటనెమలిపురి, అనుపాలెం మీదుగా యాత్ర సాగింది. తనకోసం వేచి ఉన్న అభిమానులకు అభివాదం చేస్తూ యాత్ర ముందుకు సాగింది. అక్కడి నుంచి బెల్లంకొండ, రాజుపాలెం మీదుగా రెడ్డిగూడెం చేరగా అక్కడ వేచి ఉన్న మహిళలు, అభిమానులు బస్సు ముందుకు వచ్చి కాసేపు ఆగాలని పట్టుబట్టారు. దీంతో బస్సు టాప్ పైకి వెళ్లి అందరికి అభివాదం చేసి ముందుకు సాగారు. ధూళిపాళ్ల శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస కేంద్రం వద్దకు రాత్రి 9.10 గంటలకు చేరుకోవడంతో మేమంతా సిద్ధం సభ 12 రోజు యాత్ర విజయవంతంగా ముగిసింది.

సమస్యలు వింటూ.. భరోసా నిస్తూ

తనకు సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని అక్కున చేర్చుకొని వారి బాధలను వైఎస్ జగన్ తెలుసుకున్నారు. వారికి భరోసా కల్పించి, సహాయానికి తక్షణ ఆదేశాలు జారీచేశారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న సంతమాగలూరు మండలం కొమ్మాలపాడుకు చెందిన షేక్ హుస్సేన్ బాషాకు ఆరోగ్యశ్రీ ద్వారా తగిన చికిత్స అందేలా చూడాలని అధికారులకు సూచించారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మొగలి సరస్వతికి చికిత్సకు భరోసానిచ్చారు. నూజెండ్ల మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన నామేపల్లి ఆదిత్య, శావల్యాపురం మండలం వయ్యకల్లు గ్రామానికి చెందిన శాఖమూరి విజయలక్ష్మిలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ సమస్యను వివరించగా పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు.



అన్నా ఒక్క ఫొటో... సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తున్న జనం



ఆనందం... జగనన్నను చూసేందుకు వచ్చిన మహిళలు



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, పక్కన అనిల్, గోపిరెడ్డి



నారా దిష్టిపోవాలి... జగనన్నకు దిష్టి తీస్తున్న మహిళలు

క్లుప్తంగా

సర్వే ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

- జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి
- ఘనంగా జాతీయ సర్వే దినోత్సవం



గుంటూరు వెస్ట్: రెవెన్యూ రికార్డుల రక్షణలో సర్వే ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి కొనియాడారు. జాతీయ సర్వే దినోత్సవాన్ని బుధవారం కలెక్టరేట్ ఆవరణలో ఏపీ సర్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ దాదాపు వందేళ్ల తర్వాత ఇటీవల నిర్వహించిన భూ రీ సర్వేలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందన్నారు. సర్వే నిర్దిష్టంగా, పారదర్శకంగా ఉంటే అనేక ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఆవిర్భావం తర్వాత మరింత మంది సర్వేయర్లు అందుబాటులోకి రావడం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. అనంతరం తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జేసీ, ఆర్డీఓ పి.శ్రీకర్, సర్వే శాఖ ఏడీ వై.నాగేశ్వర్ ప్రారంభించారు. పలువురు సర్వే ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ సర్వే ఎప్లాంయీస్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి ఆర్.మల్లికార్జునరావు, పి.వి. భావన్నారాయణ పాల్గొన్నారు.

సక్సెస్ ఫుల్‌గా టోఫెల్ పరీక్ష

జిల్లాలో ఎంపిక చేసిన 328 పాఠశాలల్లో నిర్వహణ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యార్థుల్ని ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన టోఫెల్ పరీక్ష బుధవారం జిల్లాలోని ఎంపిక చేసిన 328 పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పరీక్షను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. టోఫెల్ ప్రిపరేటరీ సర్టిఫికేషన్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 328 పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదువుతున్న 9,884 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలపై ప్రశ్నలు డిస్‌ప్లే చేసి, వాటికి సమాధానాలు రాసే విధంగా చేసిన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పరీక్ష నిర్వహణను ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డితో పాటు డీసీఈబీ కార్యదర్శి జి. లలిత ప్రసాద్, డీవైఈవోలు పరిశీలించారు.

పలు రైళ్లు రద్దు , దారి మళ్లింపు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల దృష్ట్యా పలు రైళ్ల రద్దుతో పాటు దారి మళ్లించనున్నట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రైలు నంబర్ 07464ను (విజయవాడ-గుంటూరు), 07465 (గుంటూరు-విజయవాడ), 07976 (గుంటూరు-విజయవాడ) ఈనెల 10 నుంచి 30 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. రైలు నంబర్ 17239ను (ఎస్ఎస్ఎస్ హుబ్లీ-విజయవాడ)ను ఈనెల 9నుంచి 29వరకు గుంటూరు-విజయవాడ స్టేషన్ల మీదుగా తాత్కాలిక రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రైలు నంబర్ 17330ను (విజయవాడ-ఎస్ఎస్ఎస్ హుబ్లీ)ను ఈ నెల 10నుంచి 30 వరకు విజయవాడ-గుంటూరు స్టేషన్ల మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలియజేశారు. రైలు నంబర్ 12077ను (చెన్నై సెంట్రల్- విజయవాడ) ఈనెల 10నుంచి తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించనున్నట్లు వివరించారు. రైలు నంబర్ 16031ను (చెన్నై సెంట్రల్-ఎస్ఎంవీడి కత్రా) ఈనెల 10నుంచి తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. రైలు నంబర్ 16903ను (చెన్నై సెంట్రల్-లక్నో) ఈనెల 13 నుంచి 30 వరకు తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించినట్లు వివరించారు. ప్రయాణికులంతా గమనించాలని ఆయన కోరారు.

జగన్‌ను సీఎం చేసేందుకు 'మేమంతా సిద్ధం'

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 'మేమంతా సిద్ధం' సభను విజయవంతం చేయాలి
- ప్రజలు మరోసారి జగన్‌ను గెలిపించుకునేందుకు సిద్ధం
- బస్సు యాత్రకు అందుకే సంచలన స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విడదల రజని. వేదికపై ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే మద్దాళి

నెహ్రూనగర్: ప్రజలు మరోసారి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకే 'మేమంతా సిద్ధం' సభలకు భారీగా తరలివస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రకు సంబంధించిన వివరాలు వెల్లడించేందుకు స్థానిక చంద్రమౌళీనగర్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ఈ నెల 12న బస్సు యాత్ర గుంటూరులోకి ప్రవేశిస్తుందని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పేరేచర్ల, నల్లపాడు మీదుగా హౌసింగ్ బోర్డుకు చేరుకుంటుందని చెప్పారు. అక్కడి నుంచి చుట్టుగుంట సెంటర్, వీఐపీ రోడ్డు మీదుగా ఏటుకూరు ప్రాంతానికి యాత్ర చేరుకుంటుందన్నారు. అక్కడే మేమంతా సిద్ధం సభను నిర్వహిస్తున్నామన్నారు. అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. దాదాపు 2 లక్షల మందికి పైగా ప్రజలు ఏటుకూరు సభకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వీరందరికీ ఏ లోటు రాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విపరీతమైన ఆదరణ పెరగడానికి కారణాలయ్యాయని వెల్లడించారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రకు అద్భుతమైన స్పందన లభిస్తోందన్నారు. గుంటూరులో అంతకుమించి వస్తుందని చెప్పారు.

- అప్పిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఒక్కో డివిజన్ నుంచి 20వేల మంది చొప్పున 'మేమంతా సిద్ధం' సభకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన సభలన్నీ గ్రాండ్ సక్సెస్ అయ్యాయని చెప్పారు. ఏటుకూరు సభకు రెండు లక్షల మందికి పైగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.
- పొన్నూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య మాట్లాడుతూ ఏటుకూరు సభకు ప్రజలు భారీఎత్తున హాజరవుతారని వెల్లడించారు.
- ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ పార్టీ నాయకులంతా ప్రణాళికాబద్ధంగా వ్యూహరచన చేసి ఏటుకూరు సభ విజయవంతానికి కృషి చేయాలని కోరారు.
- ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సీఎం వైఎస్. జగన్ బస్సుయాత్రను ప్రతి ఒక్కరూ జయప్రదం చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. సమావేశంలో వెస్ట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకుడు లాలుపురం రాము, నగర డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

సభ స్థలాన్ని పరిశీలించిన వైఎస్సార్ సీపీ నేతలు

గుంటూరు రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న 'మేమంతా సిద్ధం' సభ స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం పరిశీలించారు. రూరల్ మండలం 16వడివిజన్ పరిధిలోని ఏటుకూరు, బొంతపాడు సమీపంలో ప్రాంగణం ఏర్పాట్లను రాష్ట్ర వైద్యఆ రోగ్యశాఖ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విడదల రజిని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము), గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మండపాటి శేషగిరిరావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు సభ ఏర్పాట్లు, వసతులు పరిశీలించారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో బువారం నిర్వహించిన ప్రజాప్రతినిధుల, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన 128 వలంటీర్లను తొలగించామని, ఐదుగురు కాంట్రాక్ట్, ఆరుగురు ఔట్ సోర్సింగ్, ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులపైనా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 520 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారని తెలిపారు. ఎన్నికల సంఘానికి చేసిన 52 ఫిర్యాదుల్లో 51 పరిష్కరించామని చెప్పారు. సీ-విజిల్ అందిన 168 ఫిర్యాదులకు గాను నిర్దేశించిన 100 నిమిషాల్లోనే 161 పరిష్కరించామని పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, తనిఖీ బృందాలు ఇప్పటి వరకు రూ.3.20 కోట్లు నగదు, మద్యం, వస్తువులు స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. కుటుంబ అవసరాల నిమిత్తం ప్రజలు తీసుకెళ్లే నగదు, వస్తువులను తనిఖీ బృందాలు సీజ్ చేస్తే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ రిడ్రెసెల్ కమిటీకి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి 24 గంటల్లోపే రిలీజ్ చేస్తారని తెలియజేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో తొలి ర్యాండమైజేషన్

ఈవీఎంల తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈ నెల 12, 13 తేదీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గాలకు ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్‌లను ర్యాండమైజేషన్ ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని చెప్పారు. ఈవీఎం యూనిట్లను గతంలోనే బెల్ ఇంజినీర్లు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో తొలి దశ తనిఖీలు నిర్వహించారని తెలిపారు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంలు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌లను సిబ్బంది జాగ్రత్తగా సరిచూసుకోవాలని ఆయన సూచించారు. మార్గదర్శకాలను అనుసరిస్తూ పూర్తి భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించాలని తెలిపారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ బాధ్యతలు నిర్వహించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఆర్డీఓ పి.శ్రీకర్, ఐటీ నోడల్ అధికారి రఘు, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద కట్టుదిట్ట భద్రత ఏర్పాట్లు

నగరంపాలెం: రంజాన్ పురస్కరించుకుని నమాజు జరిగే ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం ఒక ప్రకటనలో పోలీస్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగర పరిధిలోని ఆంధ్ర ముస్లిం కళాశాల, ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రమేష్ ఆసుపత్రి వద్దనున్న ఈద్గాలు, మంగళగిరి, తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరు, మేడికొండూరు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లోనూ భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం జగన్ నమ్మకాన్ని నిలబెట్టాలి

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- భారీ మెజార్టీతో గెలిచి సీఎంకు కానుకగా ఇవ్వాలి
- 15నుంచి రోడ్‌షోల షెడ్యూలు ఖరారు
- 22న నామినేషన్ దాఖలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: తెనాలి నియోజకవర్గంపైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం సాధించి సీఎంకు కానుకగా ఇవ్వాలని కోరారు. తెనాలి నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తల విస్తృత సమావేశం బుధవారం స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ మహిళా ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో నిర్వహించారు. నియోజకవర్గం నుంచి వందలాదిగా హాజరైన సమావేశంలో ఎన్నికలకు సమాయత్తంపై పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే శివకుమార్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని శాస్త్రీయంగా అధ్యయనం, విశ్లేషణ చేశారని చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో అవసరమైన మార్పులు చేసుకుంటూ వచ్చారన్నారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మార్పులు చేసినా, తెనాలిలో సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన తనకే అవకాశం కల్పించినట్టు శివకుమార్ గుర్తుచేశారు. నియోజకవర్గంపై జగన్‌మోహన్‌రెడ్డికి గల సంపూర్ణ విశ్వాసమే ఇందుకు కారణమన్నారు. మే 13న జరగనున్న పోలింగ్‌లో భారీ మెజారిటీతో గెలిచేందుకు కృషి చేద్దామని చెప్పారు. ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు ఈనెల 15నుంచి రోడ్‌షోల షెడ్యూలును రూపొందించినట్టు శివకుమార్ తెలియజేశారు. తొలిరోజున చినరావూరు పార్కు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు తాను, ఎంపీ అభ్యర్థి రోడ్‌షో, పాదయాత్రలో పాల్గొంటామని చెప్పారు. ఈనెల 22న ఉదయం 9.30 గంటలకు తాను నామినేషను దాఖలు చేయనున్నట్టు ఎమ్మెల్యే శివకుమార్ ప్రకటించారు. ఆ రోజు మొదటగా టౌన్‌చర్చి, మసీదుల్లో ప్రార్థనల అనంతరం బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి చేరుకుని, అక్కడ్నుంచి ఎడ్లబండిపై నామినేషనుకు తరలివెళ్లనున్నట్టు వెల్లడించారు. 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రలో భాగంగా పొన్నూరు నియోజకవర్గంలో జరగనున్న బహిరంగసభకు నియోజకవర్గం నుంచి 200 బస్సుల్లో తరలివెళదామని చెప్పారు. కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి, , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, క్లస్టర్-2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, కొల్లిపర మండల పార్టీ అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, తెనాలి మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఐఎస్ఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా డాక్టర్ విజయ



గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ న్యూరో సైన్సెస్ డిపార్ట్‌మెంట్ చీఫ్ న్యూరాలజిస్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయకు అరుదైన పదవి దక్కింది. దేశ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకమైన ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) 2024-25 సంవత్సరానికి ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఎన్నికయ్యారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ 17వ వార్షిక సదస్సు మార్చి నెలాఖరులో కోల్‌కతాలో జరిగింది. సదస్సులో ప్రస్తుతం ఐఎస్ఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా ఉన్న డాక్టర్ విజయను ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయస్థాయిలో అసోసియేషన్‌కు ప్రెసిడెంట్ ఎలెక్ట్ అయిన డాక్టర్ విజయకు గుంటూరుకు చెందిన పలువురు న్యూరోసర్జన్లు, న్యూరాలజిస్టులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేతలు బుధవారం అభినందనలు తెలిపారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ, జనసేన కార్యకర్తల చేరిక



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులతో మంత్రి రజిని

నెహ్రూనగర్: మంచి చేసేవారికే ప్రజలు ఎప్పటికీ అండగా ఉంటారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. 25వ వార్డు పరిధిలో ఏకంగా 300 మంది టీడీపీ , జనసేన కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. చుట్టుగుంట సెంటర్‌లో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి విడదల రజిని వీరందరికీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. 25వ డివిజన్ టీడీపీ కార్యదర్శి శివన్నారాయణతోపాటు టీడీపీ, జనసేన పార్టీల నుంచి కొండలు, శ్రీనివాసరావు, యాకోబు, శ్రీనుబాబు, సీతాలు, సత్యనారాయణ, ఏసుబాబు, సతీష్, మహేష్, రమణకుమార్, మణి, వెంకటరావు తదితరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడు రాతంశెట్టి సీతారామాంజనేయులు, స్థానిక కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి, కార్పొరేటర్ గురవయ్య, క్లస్టర్ కార్యదర్శి దొంతా బ్రహ్మం, ఆయా డివిజన్ల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింలకు అప్పిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలు

నెహ్రూనగర్: పరమ పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి యావత్ ముస్లిం సమాజానికి శుభాకాంక్షలు(ఈద్ ముబారక్) తెలిపారు. సామరస్యానికి, సర్వమానవ సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని ఆయన వ్యాఖ్యానించారు. నియమ, నిష్టలతో కఠిన ఉపవాసం ఆచరించే పుణ్య మాసానికి రంజాన్ ఒక ముగింపు వేడుకని పేర్కొన్నారు. ఐకమత్యంతో మెలగడం, క్రమశిక్షణ కలిగి ఉండడం, పేదలకు దానధర్మాలు చేయడం వంటి సద్గుణాలే ఈ పండుగ మానవాళికి ఇచ్చే గొప్ప సందేశమని లేళ్ల అప్పిరెడ్డి వివరించారు.



సైగలకు మాటలొచ్చాయి



న్యాయవాది **అడ్వా సారా సన్నీ** భారతదేశపు మొట్టమొదటి వినికిడి లోపం గల రిజిస్టర్డ్ ప్రాక్టీసింగ్ లాయర్‌గా చరిత్ర సృష్టించారు. ఏప్రిల్ 4న ఆమెకు సహాయం చేయడానికి సమాచార, సాంకేతిక మంత్రిత్వ శాఖ ద్వారా సర్టిఫైడ్ ఇంటర్‌ప్రెటర్ సేవలను పొందాలని కోర్టు తన రిజిస్ట్రీని ఆదేశించింది. ఫలితంగా ఏప్రిల్ 8న కర్ణాటక హైకోర్ట్ రిజిస్టర్డ్ సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడి లోపం ఉన్న న్యాయవాది నుంచి వాదనలు విన్నది. దీంతో అడ్వకేట్ సారా సన్నీతోపాటు కర్ణాటక హైకోర్ట్ కూడా దివ్యాంగులకు ఒక గొప్ప బాసటగా నిలిచినట్లయింది. ఇది న్యాయ నిపుణులకు మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న పౌరులకు కూడా సమగ్ర న్యాయవ్యవస్థకు మార్గం మరింతగా సుగమం చేస్తుంది.

జస్టిస్ ఎం నాగప్రసన్న, అదనపు సొలిసిటర్ జనరల్ అరవింద్ కామత్‌లతో కూడిన సింగిల్ జడ్జి బెంచ్ అడ్వా సన్నీ నమోదును ప్రశంసించింది. ఏఎస్‌జీ కామత్ మాట్లాడుతూ 'ఇంటర్‌ప్రెటర్ ద్వారా హియరింగ్, స్పీచ్ ఇంపెయిర్‌డ్ అడ్వకేట్ వాదనను విన్న మొదటి హైకోర్టుగా కర్ణాటక హైకోర్టు చరిత్రలో నిలిచిపోతుంది. సారా సన్నీ సంకేత భాషా వ్యాఖ్యాత ద్వారా వినికిడిలోపం, ప్రసంగం బలహీనంగా ఉండటం వల్ల కలిగే వైకల్యాన్ని ఓడించింది. అందుకు సారా సన్నీని అభినందించాల్సిందే. సంజ్ఞా భాషా వ్యాఖ్యాత ద్వారా వాదప్రతివాదనలు జరిగినప్పటికీ ప్రశంసలు రికార్డులలో నమోదు అవుతాయి' అని తెలియజేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ 'భారత న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాల నుండి ఎక్కువ మంది మహిళలు చేరాల'ని పదే పదే ప్రస్తావించారు.

ప్రోత్సహించడానికి... అడ్వా సారా సన్నీ కేరళలోని కొట్టాయం వాసి. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుకున్నారు. కేవలం స్వీయ ఆసక్తితో మాత్రమే కాకుండా వినికిడి లోపం ఉన్న ఇతరులను కూడా ప్రోత్సహించడానికి న్యాయవాద వృత్తిని ఎంచుకుంది. అడ్వకేట్ సన్నీ ఇప్పుడు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డెఫ్ అండ్ హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో యాక్టివ్ మెంబర్. సెప్టెంబరు 2023లో న్యాయవాది సన్నీ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఒక కేసు వాదించిన, వినికిడి లోపం ఉన్న మొట్ట మొదటి లాయర్‌గా చరిత్ర సృష్టించింది. ఈ సందర్భంలో సన్నీ 'డీవై చంద్రచూడ్ ఓపెన్ మైండ్ ప్రత్యేక సామర్థ్యం ఉన్న వ్యక్తుల కోసం తలుపులు తెరిచింది' అని తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

సన్నీ కోర్టు సబిమిషన్స్‌లో సహాయం చేయడానికి సంకేత భాషా ఇంటర్‌ప్రెటర్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు గతంలో తన రిజిస్ట్రీని, కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఇప్పుడు అది అమలు అయ్యింది. వైకల్యాలున్నవారు తమ అడ్డంకులను అధిగమించడంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అయ్యింది.

సమతా మమతల పర్వం ఈదుల్ ఫిత్ర్!

నేడు రమజాన్

అల్లాహు అక్బర్ ..
అల్లాహు అక్బర్ ..
లాయిలాహ ఇల్లల్లాహు
వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలి
ల్లాహిల్ హంద్ ..!

ఈ రోజు ఎటువిన్నా ఈ స్తోత్ర గానమే, ఆ దయామయుని కీర్తిగానమే వినిపిస్తూ హృదయాలను పులకింపజేస్తూ ఉంటుంది. ఊరు, వాడ, పల్లె, పట్నం, చిన్నా పెద్దా, ఆడా మగా, ముసలీ ముతకా అనే తేడా లేకుండా ఎవరి నోట విన్నా ఈ అమృత వచనాలే జాలువారుతూ ఉంటాయి.

కొత్తబట్టలు, కొత్తహంగులు, తెల్లని టోపీలు మల్లెపూలలా మెరిసిపోతుంటాయి. అత్తరు పన్నీరు పరిమళాలు, అస్సలాము అలైకుం, ఈద్ ముబారక్‌లు, చిరునవ్వుల కరచాలనాలు, ఆలింగనాల ఆనంద తరంగాలు, అలయ్ బలయ్‌లతో విశ్వాసుల హృదయాలు సంతోషసాగరంలో ఓలలాడుతూ ఉంటాయి.

సేమ్యాలు, షీర్ ఖుర్మాలు, బగారా, బిర్యానీల ఘుమఘుమలతో, ఉల్లాస పరవళ్ళ హడావిడితో ముస్లిముల లోగిళ్ళు కిలకిలనవ్వుతూ, కళకళలాడుతూ ఉంటాయి. ఇళ్ళలో ఆడాళ్ళ హడావిడికి, పిల్లల సందడికి హద్దులే ఉండవు. ఎందుకంటే ఇది ఒక్కనాటి పండుగ కాదుగదా! నెల్లాళ్ళపాటు భక్తిప్రపత్తులతో జరుపుకున్న పండుగకు అల్విదా చెబుతున్న ముగింపు ఉత్సవం.

రమజాన్ నెలరోజులూ ముస్లింల వీధులు 'సహెరీ','ఇఫ్తార్' ల సందడితో నిత్యనూతనంగా కొత్తశోభతో అలరారుతుంటాయి. మసీదులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ, ప్రేమామృతాన్ని చిలకరిస్తూ వింత అనుభూతుల్ని పంచుతుంటాయి. భక్తులు పవిత్ర గ్రంథ పారాయణా మధురిమను గ్రోలుతూ వినూత్న అనుభూతులతో పరవశించి పోతుంటారు. అవును.., ఇలాంటి అనుభూతులు, ఆనందాలు, ఆహ్లాదాలు, అనుభవాలు, అనుభూతుల సమ్మేళనమే పండుగ. ఇలాంటి ఓ అద్భుతమైన, అపురూప సందర్భమే 'ఈదుల్ ఫిత్ర్'. దీన్నే రమజాన్ పండుగ అంటారు. ముస్లిం సమాజం జరుపుకునే రెండు ముఖ్యమైన పండుగల్లో ఇది మొదటిదీ, అతి పవిత్రమైనదీను. ఈ నెలలో ముస్లింలు అత్యంత నియమనిష్ఠలతో రోజా వ్రతం పాటిస్తారు. భక్తిశ్రద్ధలతో రోజూ ఐదుసార్లు నమాజ్ చేస్తారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని భక్తితో పారాయణం చేస్తూ, దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. ముహమ్మద్ ప్రవక్త(స)వారిపై సలాములు పంపుతూ ఉంటారు. దైవనామస్మరణలో అనునిత్యం వారి నాలుకలు నర్తిస్తూ ఉంటాయి. ప్రతిరోజూ తరావీహ్ నమాజులో పాల్గొని తన్మయులవుతుంటారు. దానధర్మాలు చేస్తారు, ఫిత్రాలు చెల్లిస్తారు. ఈ విధంగా రమజాన్ చంద్రవంక దర్శనంతో ప్రారంభమైన ఉపవాసదీక్షలు నెలరోజుల తరువాత షవ్వాల్ మాసం నెలవంక దర్శనంతో సమాప్తమవుతాయి. షవ్వాల్ మొదటితేదీన జరుపుకునే 'ఈదుల్ ఫిత్ర్' పర్వదినాన్నే మనం రమజాన్ పండుగ అంటున్నాము. ఈ పండుగ సంబంధం రమజాన్ నెలతో ముడివడి ఉన్న కారణంగా ఇది రమజాన్ పండుగగా ప్రసిద్ధి చెందింది. రమజాన్ ఉపవాస దీక్షలు, పవిత్ర ఖురాన్ అవతరణతో దీని సంబంధం పెనవేసుకు పోయి ఉంది.

మానవుల్లో దైవభక్తిని, దైవభీతిని, సదాచారాన్ని, మానవీయ విలువల్ని జనింపజేయడానికి సృష్టికర్త ఉపవాస వ్రతాన్ని విధిగా నిర్ణయించాడు. దైవాదేశ పాలనకు మనిషిని బద్ధునిగా చేయడమే ఉపవాస దీక్షల అసలు లక్ష్యం. ఒక నిర్ణీత సమయానికి మేల్కొనడం, సూర్యోదయం కాకముందే భుజించడం(సహెరి), సూర్యాస్తమయం వరకూ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టకుండా, రోజూ ఐదుసార్లు దైవారాధనచేస్తూ సూర్యాస్తమయం తరువాత రోజా విరమించడం(ఇఫ్తార్), మితాహారం తీసుకోవడం, మళ్ళీ అదనపు ఆరాధనలు అంటే తరావీహ్ నమాజులు చేయడం, మళ్ళీ తెల్లవారు ఝామున లేవడం – ఈవిధంగా రమజాన్ ఉపవాస వ్రతం మనిషిని ఒక క్రమశిక్షణాయుతమైన, బాధ్యతాయుతమైన, దైవభక్తి పరాయణతతో కూడుకున్న జీవనవిధానానికి అలవాటు చేస్తుంది. మానవుల్లో ఇంతటి మహోన్నత విలువలను, సుగుణాలను జనింపజేసే వ్రతాన్ని పరాత్పరుడైన అల్లాహ్ వారికి అనుగ్రహించినందుకు, వాటిని వారు నెలరోజులూ త్రికరణ శుద్ధిగా పాటించ గలిగినందుకు సంతోష సంబరాల్లో తేలిపోతూ కృతజ్ఞతాపూర్వకంగా భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు.

మరో ముఖ్య విషయం ఏమిటంటే, పవిత్ర రమజాన్ నెలలోనే సమస్త మానవాళి సన్మార్గ దీపిక అయిన మహత్తర గ్రంథరాజం ఖురాన్‌ను దేవుడు మానవాళికి ప్రసాదించాడు. సమస్త మానవజాతికీ మార్గదర్శక జ్యోతి పవిత్ర ఖురాన్. సన్మార్గం చూపే, సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన ఉపదేశాలు ఇందులో ఉన్నాయి. ఈ గ్రంథరాజం మానవులందరికీ సన్మార్గ బోధన చెయ్యడానికి అవతరించిన ప్రబోధనా జ్యోతి.

దైవ ప్రసన్నతను చూరగొనడానికి రోజా పాటించడం,'తరావీహ్ 'లు ఆచరించడం, దానధర్మాలు చేయడంతో పాటు, ఈ నెల చివరిలో'లైలతుల్ ఖద్ర్' అన్వేషణలో అధికంగా ఆరాధనలు చేస్తారు. లైలతుల్ ఖద్ర్ అంటే అత్యంత అమూల్యమైన రాత్రి అని అర్థం.

ఉపవాసం పాటించడంవల్ల పేదవాళ్ళ ఆకలి బాధలు అర్థమవుతాయన్నారు. సంపన్నులకు, ముప్పూటలా సుష్టుగా తినేవారికి నిరుపేదల ఆకలికేకలు వినబడవు. అలాంటివారు గనక ఉపవాసం పాటించినట్లయితే ఆకలి బాధ ఎలా ఉంటుందో వారికీ తెలుస్తుంది. తద్వారా పేదసాదలను ఆదుకోవడం, వారికి పట్టెడన్నం పెట్టడం ఎంతగొప్ప పుణ్యకార్యమో వారు అనుభవపూర్వకంగా తెలుసుకోగలుగుతారు. ఈ విధంగా రమజాన్ నెల ఆరంభంనుండి అంతం వరకు ఒక క్రమపద్ధతిలో ధర్మం చూపిన బాటలో నడుస్తూ, దైవప్రసన్నత, పుణ్యఫలాపేక్షతో ఈనెలను గడిపినవారు ధన్యులు. నిజానికి ఇలాంటివారే పండుగ శుభకామనలకు అర్హులు. అందుకే 'ఈద్ '(పండుగ)ను శ్రామికుని వేతనం(ప్రతిఫలం)లభించే రోజు అని చెప్పడం జరిగింది. ఈ విధంగా రమజాన్ పర్వదినం మనిషిని ఒక ఉన్నతమానవీయ విలువలుకలవాడుగా తీర్చిదిద్ది, సమాజంలో శాంతి, సమానత్వం, సామరస్యం, సోదర భావాలకు పునాదివేస్తుంది. ప్రేమ తత్వాన్ని ప్రోదిచేస్తుంది. ఇదే ఈదుల్ ఫిత్ర్ – రమజాన్ పర్వదిన పరమార్థం.



ఈ కాలంలోనే ఆర్థికంగా కలిగిన వాళ్ళు తమ ధనంలోని ఒక నిర్ణీతభాగాన్ని పేదసాదలకు దానం చేస్తారు. 'జకాత్' నిజానికి దానంకాదు. పేదవారి హక్కు. తమ నిల్వ ఆదాయంలోంచి నూటికి రెండున్నర శాతం తీసి దానం చేస్తారు. అలాగే ఫిత్రాలు కూడా! ఇది ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా కాస్తో కూస్తో కలిగిన వారందరూ చెల్లించాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పండుగ జరుపుకునే స్థోమతలేని వారికి ఫిత్రా దానం వల్ల గొప్ప ఊరట లభిస్తుంది. దీనివల్ల పేదసాదలు కూడా కొత్త బట్టలో, పండుగ సామగ్రో కొనుక్కోగలుగుతారు. ముస్లిములు, ముస్లిమేతరులు అన్న భేద భావం లేకుండా సమాజంలోని పేద సాదలపట్ల సంపన్నులు తమ బాధ్యతను గుర్తెరిగి మసలుకోవలసిన అవసరాన్ని రమజాన్ గుర్తుచేస్తుంది. అనవసర భోగవిలాసాలకు తమ ధనం వృథా చేయకుండా అగత్యపరులను ఆదుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతుంది. అందుకే ప్రవక్త వారు రమజాన్‌ను 'సానుభూతుల నెల' అన్నారు.

సదాచరణల సంపూర్ణప్రతిఫలం లభించిన సంతోషంలో అంబరాన్నంటేలా సంబురాలు జరుపుకొని ఆనంద తరంగాల్లో తేలియాడే రోజు ఈదుల్ ఫిత్ర్. – ఆరోజు ముస్లిములందరూ ఈద్ నమాజ్ ముగించుకొని పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగకు ప్రత్యేకంగా తయారు చేసిన సేమియా పాయసాన్ని తమ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిఖ్ఖు సోదరులందరికీ ఆప్యాయంగా రుచి చూపించి తమ ఆనందాన్ని వారితో పంచుకుంటారు.'ఈద్ ముబారక్' అంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ఆలింగనాలు చేసుకుంటారు.

పవిత్ర ఖురాన్ రూపంలో అవతరించిన సృష్టికర్త మహదనుగ్రహం దానవుడి లాంటి మానవుణ్ణి దైవదూతగా మలిచింది. అజ్ఞానం అంధకారాల కారు చీకట్ల నుండి వెలికి తీసి, విజ్ఞానపు వెలుగుబాటకు తీసుకు వచ్చింది. నైచ్యపు అగాథాలనుండి పైకిలాగి పవిత్రతా శిఖరాలపై నిలిపింది. మానవుల్లోని పశుప్రవృత్తిని మానవీయ పరిమళంతో పారద్రోలింది. ఆటవికతను నాగరికతతో, అజ్ఞాన తిమిరాన్ని జ్ఞానదీపికతో, అవివేకాన్ని వివేకంతో పారద్రోలి మనుషుల్ని మానవోత్తములుగా సర్వతోముఖంగా తీర్చిదిద్దింది. మానవాళికి ఇంతటి మహదానుగ్రహాలు ప్రసాదించి, వారి ఇహపరలోకాల సఫలతకు పూబాటలు పరిచిన నిఖిల జగన్నాయకునికి కృతజ్ఞతాభివందనాలు చెల్లించుకోవడమే ఈ పండుగ ఉద్దేశ్యం.

ఈదుల్ ఫిత్ర్ పర్వదిన శుభాకాంక్షలు

– మదీహా అర్జుమండ్

ఘనత



కింద గాఢంగా పారే చీనాబ్ నది. పైన 359 మీటర్ల ఎత్తులో రైలు బ్రిడ్జి. కశ్మీర్ లోయలో ఉధమ్‌పూర్ నుంచి బారాముల్లా వరకు వేయదలచిన భారీ రైలు మార్గంలో చీనాబ్‌ను దాటడం ఒక సవాలు. దాని కోసం సాగిన ఆర్చ్ బ్రిడ్జి నిర్మాణంలో మన తెలుగు ఇంజనీర్ మాధవీ లత కృషి కీలకం. 'వరల్డ్ హైయ్యెస్ట్ రైల్వే బ్రిడ్జి' నిర్మాణంలో పాల్గొన్న మాధవీ లత పరిచయం.

ఆమె నదిని దాటించింది



• మాధవీ లత

ఒక సుదీర్ఘకల నెరవేరబోతోంది. సుదీర్ఘ నిర్మాణం ఫలవంతం కాబోతూ ఉంది. దేశ అభివృద్ధిలో కీలకమైన రవాణా రంగంలో ఎన్ని ఘన నిర్మాణాలు సాగితే అంత ముందుకు పోతాము. అటువంటి ఘన నిర్మాణం జాతికి అందుబాటులో రానుంది. జమ్ము కశ్మీర్‌లో ప్రపంచంలోనే అతి ఎత్తయిన రైల్వేవంతెన ట్రయల్ రన్ పూర్తి చేసుకుని త్వరలోనే కార్యకలాపాలు నిర్వహించనుంది. అయితే ఈ క్లిష్టమైన నిర్మాణంలో తెలుగు మహిళా ఇంజినీర్ కీలకపాత్ర పోషించడం ఘనంగా చెప్పుకోవాల్సిన సంగతి. తెనాలికి చెందిన ప్రొఫెసర్ గాలి మాధవీలతదే ఈ ఘనత.

చీనాబ్ ఆర్చ్ బ్రిడ్జ్

భారతీయ రైల్వే 2004లో జమ్ము–కశ్మీర్‌లో భారీ రైలు ప్రాజెక్ట్‌కు అంకురార్పణ చేసింది. జమ్ము సమీపంలోని ఉధంపూర్ నుంచి శ్రీనగర్ సమీపంలోని బారాముల్లా వరకు రైలు మార్గం నిర్మించడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఈ మార్గంలో రీసీ జిల్లా బాక్కల్ దగ్గర చీనాబ్ నదిపై వంతెన నిర్మించాల్సి వచ్చింది. ఇది చాలా క్లిష్టమైన నిర్మాణం. ఎందుకంటే ఇది ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్ల ఎత్తు వంతెన అవుతుంది. అయినప్పటికీ మన ఇంజినీర్లు దశల వారీగా నిర్మాణం పూర్తి చేయగలిగారు. జూలైలో దీని కార్యకలాపాలు పూర్తిస్థాయిలో మొదలవుతాయి.

ప్రొఫెసర్‌గా పని చేస్తూ...

ప్రకాశం జిల్లా ఏడుగుండ్లపాడుకు చెందిన మాధవీలత కాకినాడలో ఇంజినీరింగ్ చేశారు. ఐ.ఐ.టి. మద్రాస్‌లో పీహెచ్‌డీ చేశారు. బెంగళూరులోని ఐ.ఐ.ఎస్.సి.లో 'రాక్ మెకానిక్స్'లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌ను కొనసాగించారు. బెంగళూరులో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మాధవీలత అక్కడే సెంటర్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ విభాగానికి చైర్‌పర్సన్‌గా కూడా ఉంటూ సైన్స్‌ను, టెక్నాలజీని గ్రామీణాభివృద్ధికి చేరువ చేసే ప్రాజెక్టులకు నాయకత్వం వహిస్తున్నారు. అయితే 'రాక్ మెకానిక్స్'లో మాధవీలతకు ఉన్న అనుభవమే ఆమెను చీనాబ్ వంతెన



నిర్మాణంలో పాల్గొనేలా చేసింది. చీనాబ్ వంతెన నిర్మాణానికి రూ.1400 కోట్లు వ్యయం చేస్తే 300 మంది సివిల్ ఇంజినీర్లు, 1300 మంది వర్కర్లు రేయింబవళ్లు పని చేశారు. బ్రిడ్జ్‌ను రెండు కొండల మధ్య నిర్మించాల్సి ఉన్నందున ఇంజినీరింగ్ డిజైన్ చాలా క్లిష్టంగా మారింది. అయినప్పటికీ అక్కడి రాళ్లను పరిశోధించి, అధ్యయనం చేసిన మాధవీలత, పటిష్టమైన వాలు స్థిరీకరణ ప్రణాళికను రూపొందించి, అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ వచ్చారు. ఆమె విశ్లేషణ, సాంకేతిక సూచనలను దేశంతోపాటు విదేశాల్లోని పలువురు నిపుణులు తనిఖీ చేసి ఆమోదించడంతో వంతెన నిర్మాణం ముందుకు సాగింది. ఈ రైలు మార్గంలో నిర్మించిన కొన్ని సొరంగాల నిర్మాణంలోనూ మాధవీలత పాల్గొన్నారు.

అవకాశం ఇలా...

ఉధంపూర్ – బారాముల్లా కొత్త రైలుమార్గంలో చీనాబ్ నదిపై స్టీల్ ఆర్చ్ వంతెన నిర్మాణ బాధ్యతను కొంకణ్ రైల్వేస్ 'ఆఫ్కాన్స్' సంస్థకు ఇచ్చింది. ఆఫ్కాన్స్ సంస్థకు జియో టెక్నికల్ కన్సల్టెంటుగా ఉన్న మాధవీలతకు అలా ప్రాజెక్టులో పనిచేసే అవకాశం లభించింది. 'ప్రాజెక్టు నిర్మాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి. చీనాబ్ నదిపై రెండు ఎత్తయిన వాలు కొండలను కలుపుతూ సాగిన ఈ వంతెన నిర్మాణంలో వాలు స్థిరత్వం కీలకమైంది. రాక్ మెకానిక్స్ సాంకేతికత, స్థిరత్వ అంశాలను అర్థం చేసుకోవటం, కొండ వాలుల స్థిరత్వాన్ని పొందటానికి నేను పరిష్కారాలను అందించటంతో ఇప్పుడో ఇంజినీరింగ్ అద్భుతం సాక్షాత్కరించింది. జోన్–5 భూకంపాలను, గంటకు 266 కి.మీ వేగంతో వీచే గాలులను, తీవ్రమైన పేలుళ్లను తట్టుకునేలా ఈ వంతెన నిర్మితమైంది' అన్నారు మాధవీలత. 'నేల పటిష్టతపై ఐ.ఐ.టి మద్రాస్‌లో నా పీహెచ్‌డీ పరిశోధనల్లో భాగంగా పాలిమర్‌లను ఉపయోగించి పటిష్టమైన రోడ్ల నిర్మాణానికి వినూత్న సాంకేతిక విధానాన్ని రూపొందించాను. ఆ దిశగా మూడు దశాబ్దాలపాటు చేసిన పరిశోధనల ఫలితంగా నేడు భూకంప నిరోధక శక్తి కలిగిన నిర్మాణాల్లో పాలిమర్‌లని, రబ్బర్ టైర్ల వంటి వ్యర్థపదార్థాలని వినియోగించగలుగుతున్నాం' అన్నారు. చీనాబ్ వంతెన నిర్మాణానికి రేయింబవళ్లు శ్రమించిన మాధవీలత, ఈ ప్రాజెక్టు కోసం ఎన్నో వ్యక్తిగత త్యాగాలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. తన కుటుంబ ప్రాధాన్యతలను పక్కనపెట్టి, సైట్‌ను సందర్శించిన సందర్భాలను గుర్తు చేసుకుంటూ, 'నా పిల్లల పరీక్షల సమయాల్లో కూడా వాళ్లను వదిలి వెళ్లాల్సి వచ్చేది. నా భర్త హరిప్రసాద్‌రెడ్డి, పిల్లలు అభిజ్ఞ, శౌర్యల సహనం, సహకారాలతో ఇది సాధ్యమైంది. చీనాబ్ వంతెన నా సొంత ప్రాజెక్టులా మారిపోయింది' అన్నారు.

– బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి

కంచికి వెళ్లిన కథను ఇంటికి తెద్దాం



• కథకారిణి గీతా రామానుజమ్

ఒకప్పుడు మనదేశంలో ప్రతి ఇల్లూ కథాకారులను తయారు చేసే గొప్ప సాంస్కృతిక వేదిక. కథాకారులు కనీసం ఇంటికొక్కరైనా ఉండేవారు. వీధిలో ఒకరిద్దరు నిష్ణాతులుండేవారు. ఆ నిష్ణాతులు కథ చెప్పడం మొదలు పెడితే చాలు, ఆ వీధిలోని అన్ని ఇళ్లలోని పిల్లలూ అక్కడే ఉండేవాళ్లు. శ్రోతలను కట్టిపడేసేటట్లు కథ చెప్పడానికి నియమిత శిక్షణ ఉండేది కాదు. వాళ్ల కథ చెప్పడంలో ఏ యూనివర్సిటీలోనూ కోర్సు చేయలేదు. అయినా సరే... కథ పూర్తయ్యేటప్పటికి హౌస్‌ఫుల్ అన్నట్లు ఆ ఇంటి వరండా నుంచి వీధి అరుగు వరకు జనంతో నిండి పోయేది. అలాంటి కథలు ఇప్పుడేమయ్యాయి?

మాయమవుతున్న కథాకారులు

గ్రామాలు కుచించుకుపోతున్నాయి, నగరాలు విస్తరిస్తున్నాయి. ప్రతి ఊరి నుంచి తరానికి కొందరు పట్టణాలకు వలసపోతున్నారు. పిల్లలకు కథలు చెప్పడానికి తగినంత ఖాళీ సమయం ఉన్న పెద్దవాళ్లు గ్రామాల్లో ఉండిపోవడం, పిల్లలు తల్లిదండ్రులతో నగరాలకు తరలి వెళ్లడంతో తరాలను కలిపి ఉంచిన కథ అనే అందమైన బంధం కూడా తెగిపోయింది. నగరాల్లో పిల్లలకు కథ చెప్పే బాధ్యతను తల్లిదండ్రులే తీసుకుందామనుకుంటే డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆ అవకాశాన్ని కూడా మింగేసింది. ఆ అగాథాన్ని గుర్తించిన విద్యావ్యవస్థ పిల్లలకు కథలు చెప్పడాన్ని సిలబస్‌లో చేర్చింది. కానీ ఆ ప్రయత్నం ఇప్పటికీ కార్పొరేట్ స్కూళ్ల దగ్గరే ఉంది. ఒక విషయాన్ని మనసుకు హత్తుకునేటట్లు చెప్పగలిగిన సాధనం కథ. అంతటి ప్రభావవంతమైన సాధనాన్ని చేతులారా జారవిడుచుకుంటున్నామని ఆలోచించిన గీతారామానుజమ్ కథను తిరిగి ఇంటికి తీసుకు రావడానికి కంకణం కట్టుకున్నారు.

ఇంటింటా కథాకారులు

'కథ కంచికి మనం ఇంటికి' అని ముగించే కథను కంచి నుంచి ఇంటికి తీసుకువచ్చే ప్రయత్నం మొదలైంది. కథల భాండాగారానికి పడి ఉన్న పీటముడిని విప్పుతున్నారు గీతారామానుజమ్. ఆమె వృత్తిరీత్యా శాస్త్రీయ గాయని. ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేటర్‌గా అనుభవం ఉంది. రేడియో కార్యక్రమాల సమన్వయ కర్త కూడా. ఆమె 1996లో తోలుబొమ్మలతో పిల్లలకు కథ చెప్పడం మొదలుపెట్టారు. పిల్లలు కథలకు దూరం కావడానికి కారణం నగరాలకు వలసలతో పాటు నానమ్మ– తాతయ్యలకు దూరం కావడం ఒక కారణమైతే, టీవీలు స్మార్ట్ ఫోన్‌లు అంతకంటే ప్రమాదమైన భూమిక పోషిస్తున్నాయంటారామె. కథలను తిరిగి మన జీవితంలోకి తీసుకు రావడానికి బెంగళూరులో కథాలయ ఇంటర్నేషనల్ అకాడెమీ స్థాపించారు. ఆమె క్రమం తప్పకుండా సమావేశాలు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ వేడుకలు నిర్వహించి లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేసుకున్నారు. గత ఏడాది అరవైకి పైగా కథాకారులతో(కథ చెప్పేవాళ్లు) 'గాథ– ముంబయి ఇంటర్నేషనల్ స్టోరీ టెల్లింగ్ ఫెస్టివల్' నిర్వహించారు. పాతికేళ్ల ప్రయాణంలో ఆమె వేలాదిమంది కథాకారులను తయారు చేశారు. ఒక విషయాన్ని తెలియ చేయడానికి, విన్న వారిలో స్ఫూర్తిని అందించడానికి, ఉత్సాహపరచడానికి, చైతన్యవంతం చేయడానికి ఉపయోగపడే అత్యంత ప్రభావవంతమైన సాధనం కథ. కథ చెప్పేటప్పుడు వినిపించేది గొంతు మాత్రమే. కానీ పలికేది గొంతు మాత్రమే కాదు. కథాకారుల ముఖం భావాలను పలుకుతుంది. గొంతు వాచకంతోపాటు నవరసాలను పలుకుతుంది. అంతకంటే ఎక్కువగా కళ్లు మాట్లాడుతాయి. అందుకే పిల్లలు చిన్నప్పుడు విన్న కథలు వారికి వృద్ధాప్యం వరకు తోడుగా వస్తాయి. వాళ్ల మనుమలకు చెప్పేవరకు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. ఇది దండలో దారంలా పైకి కనిపించని ఒక సంప్రదాయ పరంపర. ఈ పరంపరకు అంతరాయం కలగకూడదు. ఇప్పటికే ఏర్పడిన విరామానికి తెర దించుదాం. కంచికి వెళ్లిపోయిన కథను తిరిగి ఇంటికి తీసుకువద్దాం. 'అనగనగా ఒక రాజు' అంటూ కొత్త కథలను చెబుదాం. ప్రతి ఒక్కరం కథాకారులమవుదాం. పిల్లలున్న ప్రతి ఇంటినీ కథల నిలయంగా మారుద్దాం.



• చిన్నారులకు కథలు చెబుతున్న ట్రైనర్



• ఆసక్తిగా వింటున్న ప్రేక్షకులు